సాక్షి
విశాఖపట్నం
గురువారం | 8 | మే | 2025




క్షతగాత్రులను తరలిస్తూ..



రాణిబొమ్మ వద్ద అపార్ట్‌మెంట్‌లో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

న్యూస్‌రీల్

ఆపరేషన్ సిందూర్ సరైన చర్య



సీతంపేట : భారత సైనిక దళాలు ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్, పీవోకేలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడం సరైన చర్య అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. భారత సైనిక దళాలు సాధించిన ఈ విజయం పట్ల హర్షం ప్రకటించారు. ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్యమని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్ర దాడుల నుంచి మన పౌరులను రక్షించుకోవడం ముఖ్యమన్నారు. దేశం యావత్తు సైనిక బలగాలకు అండగా ఉండాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశం వాయిదా

సీతంపేట: ఈ నెల 9న జరగాల్సిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా విస్తృత స్థాయి సమావేశం వాయిదా వేసినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం రెండో విడత చందనం అరగదీత ప్రారంభమైంది. ఈనెల 12న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగులు పచ్చి చందనం(సుమారు 125 కిలోలు)ని సమకూర్చేందుకు అరగదీతను చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 42 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో రెండు రోజులపాటు అరగదీత కార్యక్రమం జరగనుంది. కాగా ఏడాదిలో నాలుగు విడతల్లో స్వామికి మూడేసి మణుగుల చొప్పున పచ్చి చందనాన్ని సమర్పిస్తారు.

ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వనజ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న వనజ

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా టి.వనజ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. 1984లో ఏపీఎస్ఈబి కేటీపీఎస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధుల్లో చేరిన వనజ వివిధ విభాగాల్లో పనిచేస్తూ.. ఏపీఎస్‌పీడీసీఎల్ ఈడీ హోదాలో 2022లో పదవీ విరమణ చేశారు. 2024లో ఐదు నెలల పాటు ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. వనజ మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలలో పనిచేసిన అనుభవంతో ఈపీడీసీఎల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎండీ పృథ్వీతేజ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ సీజీఎంలు, ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు వనజను అభినందించారు.

13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 13న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన వీసీ హాలు, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

భువనేశ్వర్‌కు త్వరలో విమాన సర్వీసు పునరుద్ధరణ

గోపాలపట్నం: భువనేశ్వర్ విమాన సర్వీసు పునరుద్ధరణకు ఒడిశా గవర్నర్ చేసిన కృషిని విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు అభినందించారు. ఒడిశా ముఖ్యమంత్రితో చర్చించి, ఒప్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సర్వీసులు త్వరలో ప్రారంభమవుతాయని ఇండిగో విమానయాన సంస్థ ద్వారా రాకపోకలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమర సన్నాహం



- మోగిన సైరన్.. దూసుకెళ్లిన యుద్ధ విమానాలు
- బాంబుల మోతలతో జనం బెంబేలు
- రంగంలోకి విపత్తు నిర్వహణ దళాలు
- మాక్ డ్రిల్‌కు సహకరించిన ప్రజలు



విశాఖలో యుద్ధ సైరన్ మోగింది. సరిహద్దుల్లో కమ్ముకున్న యుద్ధ మేఘాలు విశాఖను కమ్మేశాయి. బాంబుల మోత మోగింది.. ఇళ్లల్లో సాధారణ పౌరులు శత్రుసైన్యం చేతికి చిక్కి.. రక్తపు మడుగుల్లో పడిపోయారు. ఓవైపు సమరం సాగుతుండగానే.. మరోవైపు నుంచి విపత్తు నిర్వహణ దళాలు.. రణస్థలికి చేరుకొని.. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశాయి. ఎటుచూసినా హాహాకారాలతో విశాఖ నగరం ఉలిక్కిపడేలా.. సమర సన్నాహక మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించాయి.

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో బుధవారం సమర సన్నాహక మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖ నగరంలో పలు చోట్ల యుద్ధం జరిగినప్పుడు ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తుతాయి? వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలన్న అంశాలను విశదీకరిస్తూ మాక్ డ్రిల్స్ చేపట్టారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలనే అంశాలపై రక్షణ దళాలు ప్రజలను అప్రమత్తం చేశాయి. ఈ మాక్ డ్రిల్‌లో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఎన్‌సీసీ, ఎన్‌డీఆర్ఎఫ్, తూర్పు నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్, రైల్వే, విశాఖపట్నం పోర్టు, సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్, వైద్య శాఖ, పలువురు వలంటీర్లు భాగస్వామ్యమయ్యారు.





గాయపడ్డ మహిళను ప్రాథమిక చికిత్సకు తీసుకెళ్తున్న సిబ్బంది



వ్యక్తిని తాళ్లతో దించుతున్న సిబ్బంది

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో రాణిబొమ్మ సెంటర్‌లో సాయంత్రం రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడులు చేశాయి. హుటాహుటిన స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనాస్థలికి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు.. ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడి చికిత్స చేశారు. కొందర్ని నిచ్చెన సాయంతో కిందకు దించగా, మరికొందరిని భద్రతా సిబ్బంది మెట్ల మార్గం, తాళ్లు కట్టి తీసుకొచ్చి కాపాడారు. ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు.

క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల కారణంగా తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శనలు ఇస్తూ బలగాలు అప్రమత్తం చేశాయి. వార్ సైరన్ మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలి.. సేఫ్ జోన్‌కు ఎలా చేరుకోవాలో చేసి చూపించాయి. రోప్‌ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి వివరించాయి. ఎస్‌డీఆర్ఎఫ్ ఐజీ రాజకుమారి, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.



ఏయూలో...

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఉదయం మాక్ డ్రిల్ జరిగింది. సీటీఆర్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్ నేతృత్వంలో జరిగిన సన్నాహక చర్యల్లో భాగంగా.. యుద్ధం వస్తే పౌరులను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.. సాధారణ పౌరులు ఎలా వ్యవహరించాలనే దానిపై ప్రజలకు కళ్లకు కట్టినట్లు చూపించారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్



ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాల వద్ద..

డీఆర్ఎం కార్యాలయం వద్ద..



క్షతగాత్రులను దించుతున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఎంకే సాహూ నేతృత్వంతో సాయంత్రం వాల్తేరు డీఆర్ఎం కార్యాలయం వద్ద బ్లాక్ అవుట్ మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సంక్షోభ సమయంలో రైల్వే సిబ్బంది ఎలా వ్యవహరించాలనే దానిపైనా వాల్తేర్ డివిజన్, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు డ్రిల్ చేపట్టారు. ఎయిర్ రైడ్, పారాలాల్ రోప్ టెక్నిక్, పిక్ ఎ బ్యాగ్, క్యాజువాల్టీ లిఫ్ట్ టెక్నిక్.. ఇలా విభిన్న రకాల డ్రిల్స్ నిర్వహించి.. రైల్వే సిబ్బందితో పాటు ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

ఆక్సిజన్ టవర్స్ వద్ద అప్రమత్తం

సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి సైరన్ మోగించి నివాసితులను అప్రమత్తం చేశారు. అన్ని ఫ్లాట్లు, పరిసరాల్లో లైట్లు ఆపివేశారు. ఫ్లాట్లలో నివసిస్తున్న వారంతా బయటకు వచ్చారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఫ్లాట్లలో నివసిస్తున్న వారిని అప్రమత్తం చేస్తున్నట్టు అపార్టుమెంట్ కమిటీతెలిపింది. టవర్స్ వద్ద వార్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారని తెలిసి చుట్టుపక్కల ప్రజలు అక్కడి చేరుకున్నారు. అయితే ఈ డ్రిల్ టవర్స్‌లో ఉన్న ప్రజలకు మాత్రమేనని.. బయట ప్రజలకు అనుమతి లేదంటూ పోలీసులు, ఆక్సిజన్ టవర్స్ భద్రతా సిబ్బంది లోపలికి ఎవర్నీ రానీయలేదు. దీంతో సాధారణ పౌరులు ఆగ్రహం వ్యక్తం చేశారు.





లైట్లు ఆపేసి ఇళ్ల నుంచి బయటకు వచ్చేసిన అపార్టుమెంట్‌వాసులు

ప్రతి సచివాలయ పరిధిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తాం..



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొద్ది రోజుల్లో నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అనుకోని రీతిలో ప్రమాదం వాటిల్లితే ప్రజలు ఎలా స్పందించాలో ముందు నుంచే అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగానే నగరంలో పలు చోట్ల సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్‌తో పాటు బ్లాక్ అవుట్ మాక్ డ్రిల్స్ నిర్వహించినట్లు తెలిపారు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, ఎమర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు.



ప్రత్యేక శిబిరంలో వైద్యం అందిస్తున్న సిబ్బంది



మాక్ డ్రిల్‌కు సన్నద్ధమవుతున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందం

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్
- టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖ విద్య : పదో తరగతి, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 4,563 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అందులో 3,152 మంది రెగ్యులర్, 1,411 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఇందుకోసం 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 27 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 27 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, నలుగురు రూట్ ఆఫీసర్లు, మరో నలుగురు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 66 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో 200 మీటర్ల దూరంలో ఉన్న ఫొటో జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు, జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిట్టీల పేరిట రూ.8 కోట్లకు టోకరా



పీఎం పాలెం పోలీస్ స్టేషన్ వద్ద చిట్టీ బాధితులు

పీఎం పాలెం: చిట్టీల పేరిట సుమారు రూ.8 కోట్ల మేర టోకరా వేసిన ఘటనలో బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్ల పాలెంలో నివసిస్తున్న మంతెన సత్యవేణి కొన్నేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తోంది. ఆమెకు మధురవాడలో ఆర్‌కే మ్యాచింగ్స్ పేరుతో టైలరింగ్ షాపు కూడా ఉంది. బంధువులు, స్నేహితుల సర్కిల్ ఎక్కువగా ఉండటంతో చిట్టీలు నిర్వహించేది. మధురవాడ, పీఎం పాలెంతోపాటు గాజువాక తదితర ప్రాంతాల నుంచి చిట్టీ సభ్యులున్నారు. రూ.2 లక్షలు మొదలు రూ.20 లక్షల వరకూ విలువైన చిట్టీ గ్రూపులు నిర్వహించేది. సభ్యుల్లో ఎక్కువ మంది చిట్టీ చివరి నెలలో ఏకమొత్తంగా నగదు తీసుకోవచ్చనే వారే ఉండటంతో రూ.కోట్లలో నగదు ఆమె వద్ద ఉండిపోయింది. అడిగిన వారికి మొత్తం ఇవ్వకుండా వడ్డీ మాత్రమే ఇస్తూ, తెలివిగా నెట్టుకు వస్తోంది. పీఎం పాలేనికి చెందిన అమటపు సత్యవతి రూ.20 లక్షలు చిట్టీ వేసింది. గడువు ఫిబ్రవరి 5తో ముగిసింది. ఆ నగదు మొత్తం చెల్లించకుండా నెల రోజులుగా సత్యవేణి తాత్సారం చేస్తూ వస్తోంది. తనకు జరిగిన అన్యాయంపై సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం మిగతా సభ్యులకూ తెలియడంతో వారు కూడా సత్యవేణిని నిలదీశారు. డబ్బులు చెల్లించకపోవడంతో వారు కూడా పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

శత్రుదుర్భేద్యంగా విశాఖ

- భారత్ వినియోగిస్తున్న అత్యాధునిక క్షిపణులన్నీ విశాఖలోనే తయారీ
- ఘాజీని డాల్ఫిన్ నోస్ సమీపంలో మట్టి కరిపించిన తూర్పు నౌకాదళం
- ఎన్ఏడీ, ఐఎన్ఎస్ వర్ష, డేగా బేస్‌ల వద్ద నిరంతర పహారా
- పాక్‌తో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో అప్రమత్తత



సాక్షి, విశాఖపట్నం : భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య రోజు రోజుకూ యుద్ధ వాతావరణం భీకరంగా మారుతున్న నేపథ్యంలో కేంద్రం అన్ని శాఖలకు అలెర్ట్ ప్రకటించింది. ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఏ క్షణంలోనైనా.. అనే నినాదంతో భారత రక్షణ రంగం త్రివిధ దళాల్ని అప్రమత్తం చేసింది. అందుకే విశాఖలోనూ కేటగిరి–2 అలెర్ట్ ప్రకటించారు. భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా వ్యవహరించేలా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. సముద్రజలాల పరిరక్షణ, ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలు సాగించే కీలకమైన భద్రతకు అవసరమైన షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసెల్స్.. విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతమయ్యాయి. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాల్ని ఏర్పాటు చేస్తూ.. తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది. దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లలో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37,000 మంది సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. ఆయుధ సంపత్తిని పెంపొందించుకుంటూ రక్షణ రంగంలో రారాజుగా మారింది. ఇప్పటికే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్‌టీఎల్), నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్ఏడీ)తో పాటు ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ డేగా.. ఇలా ప్రతి అంశంలోనూ విశాఖ నగరం కేంద్రంగా మారింది.

శక్తివంతమైన క్షిపణులు ఇక్కడి నుంచే..!

భారత నౌకాదళానికి అత్యంత శక్తివంతమైన క్షిపణుల తయారీ కూడా విశాఖ నుంచే జరుగుతున్నాయి. డీఆర్‌డీవో నేతృత్వంలో పనిచేస్తున్న నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీస్(ఎన్ఎస్‌టీఎల్) ఆధ్వర్యంలో 50 కిలోమీటర్ల దూరంలోని టార్గెట్‌ని మట్టుబెట్టే వరుణాస్త్ర టార్పెడోకి ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. అదేవిధంగా రెండు రోజుల క్రితం అరేబియా సముద్రంలో పాక్‌కు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రయోగించిన మల్టీ ఇన్‌ఫ్లుయెన్స్ గ్రౌండ్ మైన్(ఎంఐజీఎం) కూడా ఇక్కడే తయారైంది. దీంతో పాటు సబ్‌మెరైన్ లాంచ్‌డ్ మిసైల్స్, యాంటీ షిప్ మిసైల్స్, ఎయిర్‌టూ ఎయిర్, యాంటీ ట్యాంక్, అండర్ వాటర్ వెహికల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ ఇలా.. శత్రుదేశాన్ని గడగడలాడించే ఆయుధ సంపత్తి విశాఖలోనే రూపుదిద్దుకుంది. అందుకే వైజాగ్ అంటేనే పాక్‌కు భయం కలుగుతుంటుంది.

1971 విజయానికి నాంది వైజాగ్

భారత్ పాకిస్తాన్ మధ్య తక్కువ రోజుల్లో అతిపెద్ద యుద్ధం జరిగింది. 1971 డిసెంబర్ 3 సాయంత్రం మొదలైన ఈ యుద్ధం డిసెంబర్ 16న పాకిస్తాన్ ఓటమితో ముగిసింది. బంగ్లాదేశ్ విమోచన అంశం ఈ యుద్ధకాండకు ప్రధాన కారణం. ఇండియన్ నేవీ కరాచీ ఓడరేవుపై చేసిన దాడిలో పాక్‌కు చెందిన యుద్ధ నౌకలు ధ్వంసమయ్యాయి. భారత్ ఎయిర్‌క్రాఫ్ట్ కారియర్ ఐఎన్ఎస్ విక్రాంత్‌ను విశాఖలో రంగంలోకి దించారు. విక్రాంత్‌తో పాటు తూర్పు నౌకాదళాన్ని నాశనం చేసేందుకు అత్యంత శక్తిమంతమైన ఘాజీ సబ్‌మెరైన్‌ని పాకిస్థాన్ పంపించగా.. విషయం తెలుసుకున్న భారత్.. ఐఎన్ఎస్ రాజ్‌పుత్ సబ్‌మెరైన్‌తో ఘాజీని విశాఖ తీరం సమీపంలోనే డాల్ఫిన్ నోస్ దగ్గరలో సాగరగర్భంలోనే కుప్పకూల్చారు. దీంతో పాక్ నావికాదళంలో 80 శాతం నష్టపోయి.. ఓటమిని అంగీకరించింది. ఈ వేదన పాక్‌ని ఇంకా తొలిచివేస్తోంది. అందుకే దగ్గరలో ఉన్న పశ్చిమ నౌకదళాన్ని దాటి.. తూర్పు నౌకాదళాన్నే ప్రతిసారీ టార్గెట్ చేస్తూ ఓటమిపాలవుతుంటుంది. ఈసారీ పాక్ మళ్లీ అదే పని చేస్తే జలసమాధి కాకతప్పదు. ఇప్పటికే నగరంలో అప్రమత్తత ప్రకటించి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈఎన్‌సీ నేవల్ బేస్‌తో పాటు ఎన్ఏడీ, ఐఎన్ఎస్ వర్ష, డేగా బేస్‌ల వద్ద నిరంతర పహారా మరింత పెంచారు.

తిరుగులేని ఆయుధ సంపత్తి



ప్రపంచ రక్షణ దళాల్లో కీలకంగా వ్యవహరించేలా తూర్పు నౌకాదళం ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతమవుతోంది. ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు విశాఖ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2037 నాటికి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న మరో 20 నుంచి 25 యుద్ధ నౌకలు తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరనున్నాయి. అదేవిధంగా మల్టీ–రోల్ 60ఆర్ అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్ 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఇ–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో ఒక్కొక్కటిగా కేంద్రీకృతమవుతున్నాయి. వీటన్నింటితో రాబోయే రోజుల్లో విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం.. దేశ రక్షణ వ్యవస్థకు పెద్దన్నలా వ్యవహరిస్తోంది.

రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం



రామజోగయ్యశాస్త్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

అల్లిపురం: ప్రముఖ సినీ గీత రచయిత రామజోగయ్య శాస్త్రికి కవి కుల కిరీటి ఆత్రేయ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ఆచార్య ఆత్రేయ 104వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గురువు సిరివెన్నెలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే గీతాలు రాస్తున్న మహోన్నత వ్యక్తి రామజోగయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్రేయ కళాపీఠం కార్యదర్శి గంటి మురళి, పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, ప్రముఖ రచయితలు మా శర్మ, ఎర్రాప్రగడ రామకృష్ణ, బీజేపీ నాయకులు డాక్టర్ సుహాసినీ ఆనంద్, కొంఠతాల రాజు, చెన్నా తిరుమలరావుపాల్గొన్నారు.

ముగిసిన అంతర హోటల్స్ క్రికెట్ టోర్నీ



ఫైనల్స్‌లో తలపడ్డ ఇరుజట్ల ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: హోటల్స్, రెస్టారెంట్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర హోటల్స్, రెస్టారెంట్స్ క్రికెట్ టోర్నీ విజేతగా పామ్‌బీచ్ హోటల్ జట్టు, రన్నరప్‌గా నోవాటెల్ జట్టు నిలిచాయి. మున్సిపల్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన పామ్‌బీచ్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 7వికెట్లకు 126 పరుగులు చేసింది. ప్రతిగా నోవాటెల్ భీమిలి రిసార్ట్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 85 పరుగులే చేయగలిగింది. 16 హోటల్స్, రెస్టారెంట్ల జట్లు టోర్నీలో పాల్గొన్నాయని సంఘం ఉపాధ్యక్షుడు పవన్‌కార్తీక్ తెలిపారు.

ప్రశాంత్‌బాబుపై పీడీ చట్టం

గోపాలపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధి పద్మనాభనగర్‌కు చెందిన పొన్నాడ ప్రశాంత్‌బాబుపై పీడీ చట్టం విధించారు. అక్రమ రవాణాదారు, దోపిడీదారు, మాదక ద్రవ్యాల నేరస్తుడు, గూండా, అనైతిక రవాణా నేరస్తుడు, భూ ఆక్రమణదారు అంశాల్లో ప్రమాదకర కార్యకలాపాల నివారణా చట్టం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గోపాలపట్నం పోలీసులు ఈ చట్టాన్ని అయనపై నమోదుచేశారు.

ఉచిత గ్యాస్.. రెండో విడతకే తుస్!

- గ్యాస్ వచ్చినా.. ఖాతాల్లో జమకాని నగదు
- మాట దాటేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు



తెల్ల రేషన్‌కార్డుదారులు	5,12,619
చౌక ధరల డిపోలు	625
జిల్లాలో మొత్తం సిలిండర్లు	8,90,345

జిల్లాలో వివరాలు

డబుల్ సిలిండర్లు	5,33,988
రూరల్‌లో	39,356
అర్బన్‌లో	4,94,632

కూటమి ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా మొదలెట్టిన ఉచిత గ్యాస్ పథకం తుస్సుమంటోంది. రెండో విడతకే సబ్సిడీ చెల్లింపులపై ప్రభుత్వం చేతులెత్తేసినట్టుంది. గ్యాస్ సిలిండర్లు డెలివరీ అయిన 24 గంటల నుంచి 48 గంటల్లో రాయితీ సొమ్ము లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో చేరతాయని చెప్పిన మాటలు.. గాల్లో కలిసిపోయాయి. రోజులు గడుస్తున్నా.. రాయితీ సొమ్ము జమకాకపోవడంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

మహారాణిపేట: ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రెండో విడత లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. తొలి విడత గ్యాస్ సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో జమయ్యాయి. రెండో విడతలో గ్యాస్ తీసుకున్న లబ్ధిదారులు రాయితీ డబ్బులు రాలేదని లబోదిబోమంటున్నారు. గ్యాస్ తీసుకుని రోజులు గడుస్తున్నా.. తమ ఖాతాల్లో సబ్సిడీ జమ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారుల్ని అడుగుతుంటే.. ఈ రోజు, రేపు అంటూ మాట దాటేస్తున్నారని వాపోతున్నారు.

మెలికల మీద మెలికలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఒక్కరికీ ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మెలికల మీద మెలికలు పెడుతున్నారు. ఉచిత సిలిండర్లు రావాలంటే రైస్ కార్డు తప్పనిసరి అని మెలిక పెట్టారు. దీంతో మధ్య తరగతి మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ఒకలా.. ఇప్పుడు మరోలా కూటమి ప్రభుత్వం మాట మార్చిందని ఆక్షేపిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు మనుగడలో ఉంటేనే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు దక్కనున్నాయి. రేషన్ కార్డు పనిచేయకపోతే ఈ పథకానికి నోచుకోలేరు. అలాగే ఈకేవైసీ కూడా తప్పనిసరి. వీటిలో ఏ తేడా వచ్చినా గ్యాస్ సొమ్ము దక్కడం కష్టంగా మారింది.

మొదలైన రాయితీ తిప్పలు

ఉచిత గ్యాస్ సిలెండర్లు పథకం అమల్లో భాగంగా మొదటి విడత పూర్తి అయ్యింది. రెండో విడత ఏప్రిల్ ఒకటి నుంచి మొదలైంది. గ్యాస్ బుకింగ్ ప్రారంభించి, డెలివరీ కూడా చేస్తున్నారు. ఇందుకు ఎల్‌పీజీ కనెక్షన్, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి చేశారు. ఇవన్నీ ఉంటేనే ఈ పథకం అమలు చేస్తున్నారు. అలా గ్యాస్ సరఫరా అయిన వారికి కూడా చేస్తున్నా.. సబ్సిడీ డబ్బులు మాత్రం చాలా మంది ఖాతాలకు జమ కావడం లేదని మహిళలు వాపోతున్నారు.

గ్యాస్ వచ్చింది, డబ్బులు రాలేదు

బుకింగ్ చేసిన కొద్ది రోజులకు వంట గ్యాస్ అయితే వచ్చింది. కానీ డబ్బులు ఇంకా రాలేదు. అడిగితే గాబరా వద్దు.. వస్తాయని సమాధానం చెబుతున్నారు. ఎప్పుడు వస్తాయని అడిగితే మాత్రం ఈకేవైసీ అయిందా అని ఆరా తీస్తున్నారు. డబ్బులు మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు.

– వరలక్ష్మి, జాలారిపేట, పెదవాల్తేరు

డెలివరీ చేసిన 48 గంటల్లో..

గతంలో మాదిరే గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత ఒక ఎస్‌ఎంఎస్ లబ్ధిదారు ఫోన్‌కు వస్తుంది. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లోగా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్నాం. డెలివరీ చేసిన 48 గంటల్లో డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాలో నేరుగా రాయితీ సొమ్ము జమ అవుతుంది.

– వి.భాస్కర్, డీఎస్‌వో, విశాఖ

సింహగిరికి చేరుకున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

మూడు నెలలపాటు అప్పన్నకు సేవలు



అప్పన్న ఆలయంలో లక్ష్మీకాంత్ నాయక్‌దాస్

సింహాచలం: ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ బుధవారం తన పరివారంతో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందించారు. తదుపరి సింహగిరిపై ఉన్న దాసుడి సత్రానికి బసచేసేందుకు తరలి వెళ్లారు. మూడు నెలలపాటు సింహగిరిపై ఉండి స్వామికి సేవలందించనున్నారు. ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా సింహాచలేశుడి సేవలో తరిస్తోంది. ఏటా సుమారు మూడు నెలలపాటు సింహగిరిపైనే ఉంటూ స్వామిని సేవించడం పరిపాటి. ఈ మూడు నెలల్లో వీరి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సింహగిరికి తరలివచ్చి అప్పన్న స్వామిని దర్శించుకుంటారు. దాసుడి ఆధ్వర్యంలో స్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిపిస్తారు. ఈ సేవల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఒడిశా భక్తులు ఆయా రోజుల్లో సింహగిరికి తరలివస్తారు. తన తండ్రి వనమాలిక్ నాయక్‌దాస్ మరణానంతరం 2008 నుంచి లక్ష్మీకాంత్ శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామిని సేవించే బాధ్యతలు స్వీకరించారు.

అప్పన్నను దర్శించుకున్న వరాహమహాదేవ్ జీయర్‌స్వామి



దేవస్థానం వైదికులు, తన శిష్యబృందంతో వరాహమహాదేవ్ జీయర్‌స్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని తమిళనాడులోని శ్రీరంగానికి చెందిన శ్రీ వరాహమహాదేవ్ జీయర్‌స్వామి తన శిష్య బృందంతో బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి మొక్కుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో పూజలు జరిపి, వేద స్వస్తి నిర్వహించారు. దేవస్థానం తరఫున స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఘన స్వాగతం పలికారు. ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని అందించారు.

మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బందిపై సీపీ సీరియస్

- భర్తపై భార్య మహిళా పోలీసులకు ఫిర్యాదు
- ఆమె స్టేషన్‌లో ఉండగానే భర్త స్నేహితుడు వచ్చి మహిళకు బెదిరింపులు
- సీపీకి ఫిర్యాదు చేసిన మహిళ

విశాఖ సిటీ: మహిళా పోలీస్‌స్టేషన్‌లో వివాహిత ఫిర్యాదు విషయంలో సిబ్బంది వ్యవహార శైలిపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయ్యారు. భర్తపై ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చిన మహిళను ఒక వ్యక్తి బెదిరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. సాగర్‌నగర్ ప్రాంతానికి చెందిన పైలా మౌళికకు సురేంద్ర అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరి మధ్య వివాదాలు కారణంగా ప్రస్తుతం దూరంగా ఉంటున్నారు. భర్త తనను కాపురానికి తీసుకువెళ్లడం లేదని మౌళిక మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు భర్త సురేంద్రకు ఫోన్ చేసి కౌన్సెలింగ్‌కు రావాలని పిలిచారు. అయితే తాను కౌన్సెలింగ్‌కు రానని తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతో అదే విషయాన్ని పోలీసులు మౌళికకు చెప్పారు. ఇదిలా ఉండగా.. మౌళిక స్టేషన్‌లో ఉన్న సమయంలో సురేంద్ర స్నేహితుడు ఒకరు వచ్చి.. ఎవరికి ఫిర్యాదు చేసినా ఏమీ చేయలేరని ఆమెను బెదిరించే ప్రయత్నం చేశాడు. దీంతో మౌళిక వెంటనే సీపీ బాగ్చికి ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై సీపీ సీరియస్ అయ్యారు. బాధితురాలు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వస్తే.. ఒక ప్రైవేట్ వ్యక్తి వచ్చి ఆమెను బెదిరించేంత వరకు సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. మహిళా స్టేషన్‌లో వచ్చే ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితులకు అండగా నిలవాలని, ఆరోపణలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని మహిళా పోలీసు అధికారులతో పాటు ఏసీపీకి కూడా సీపీ ఆదేశించినట్లు సమాచారం.

‘ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా వృద్ధి సాధించాలి’



కేంద్ర సహాయ మంత్రి శంతను ఠాకూర్‌ను సత్కరిస్తున్న డీసీఐఎల్ చైర్మన్ అంగముత్తు

సీతంపేట: ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ సహాయ మంత్రి శంతను ఠాకూర్ బుధవారం సీతమ్మధారలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(డీసీఐఎల్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. డీసీఐఎల్ అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు. పోర్టు అభివృద్ధికి మద్దతు, డ్రెడ్జింగ్ కార్యకలాపాల ద్వారా దేశవ్యాప్తంగా నావిగేషన్ చానళ్ల నిర్వహణలో సంస్థ కృషిని అభినందించారు. ఆత్మ నిర్భర్ భారత్ చొరవకు అనుగుణంగా అభివృద్ధిని ప్రోత్సహించాలని డీసీఐఎల్‌ను కోరుతూ, ఎంఎస్‌ఎంఈలు, స్థానిక విక్రేతలకు సాధికారత కల్పించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. డీసీఐఎల్ చైర్మన్ మధయ్యన్ అంగముత్తు మాట్లాడుతూ సంస్థ వ్యూహాత్మక కార్యక్రమాలు, మేజర్, మైనర్ పోర్టులలో డ్రెడ్జింగ్ మౌలిక సదుపాయాల బలోపేతంలో డీసీఐఎల్ పాత్రను విశదీకరించారు. సంస్థ సీఈవో దుర్గేష్ కుమార్ దూబే, కెప్టెన్ ఎస్.దివాకర్‌లు సంస్థ ఆర్థిక ప్రగతిని వివరించారు. అనంతరం మంత్రి ఠాకూర్‌ను ఘనంగా సత్కరించారు.

రూ.100 కోట్లతో భూగర్భ విద్యుత్ లైన్లు

- ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- కొత్తవలస విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శన

కొత్తవలస: విశాఖ నగరంలోని పలు ప్రాంతాల్లో రూ.వంద కోట్లతో భూగర్భ విద్యుత్ లైన్‌లు ఏర్పాటుచేస్తామని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్) సీఎండీ ఇమ్మాడి పృథ్వీతేజ్ తెలిపారు. మండలంలోని అర్థన్నపాలెం గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్, కొత్త జూట్ మిల్లు సమీపంలోని రాఘవేంద్ర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ కేంద్రం, కొత్తవలస విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ముందుగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మొక్కను నాటారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బొగ్గు రవాణా చార్జీలు, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు చార్జీలు వసూలుచేస్తున్నట్టు వెల్లడించారు. 11 జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలకు త్రీఫేజ్ విద్యుత్ లైన్‌లను, అర్బన్ ఏరియాలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారం, అదనపు లైన్‌ల ఏర్పాటుకు రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎం.లక్ష్మణరావు, డీఈ జి.సురేష్‌బాబు, ఎ.డి.బోని వెంకటరావు, ఏఈ ఇ.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జీఆర్పీ అదుపులో పాత నిందితుడు

తాటిచెట్లపాలెం: రైల్వే పోలీసులు దొంగతనం కేసులో తప్పించుకు తిరుగుతున్న పాత నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.శాంతారాం తమ సిబ్బందితో కలిసి బుధవారం పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. అనుమానంగా సంచరిస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రయతోష్ ఓర్హూను అదుపులోకి తీసుకుని, పరిశీలించగా పాత కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిగా గుర్తించారు. ఈ వ్యక్తి గతంలో రైల్వే స్టేషన్‌లో ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లు, జేబీఎల్ బాక్స్‌లు దొంగిలించాడు. ఈ మేరకు జీఆర్పీ స్టేషన్‌లో కేసు నమోదయింది. మళ్లీ అదే తరహా దొంగతనానికి ప్రయత్నం చేస్తుండగా బుధవారం అదుపులోకి తీసుకుని, ఇతను దొంగిలించిన పాత వస్తువులను కూడా రికవరీ చేసినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

ఇద్దరు బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

విశాఖ సిటీ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, ఇతర గేమింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఈ కేసును సైబర్ క్రైమ్‌కు అప్పగించారు. నిందితులు మిథిలాపురి కాలనీలోని సినీపోలీస్ మాల్ రోడ్డులో ఒక నివాసం నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి విజయనగరానికి చెందిన గంధి రామునాయుడు, గంధి సింహాద్రిలను అరెస్టు చేశారు. వారి నుంచి ఒక ల్యాప్‌టాప్, 3 స్మార్ట్ ఫోన్లు, 3 కీప్యాడ్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

అరుంధతి సర్కార్ మృతి తీరని లోటు

మద్దిలపాలెం: ప్రముఖ గాత్ర విద్వాంసురాలు డాక్టర్ అరుంధతి సర్కార్(86) బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె శివైక్యం పొందడం సంగీత లోకానికి తీరని లోటని ఆరాధన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ వ్యవస్థాపకులలో ఒకరైన ఆమె సంగీత సరస్వతికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. వేలాది శిష్య బృందాన్ని తయారు చేశారని పేర్కొన్నారు.

ఉగ్రవాదులను నిర్మూలించాలి



జాతీయ జెండాలతో సంఘీభావం వ్యక్తం చేస్తున్న సమితి సభ్యులు

ఏయూక్యాంపస్ : భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల జన జాగరణ సమితి సంతోషం వ్యక్తంచేసింది. బుధవారం ఉదయం బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద జాతీయ పతాకాలు పట్టుకుని తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్ కుమార్ మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలను పూర్తిస్థాయిలో నాశనం చేయడంలో భారత్ సఫలీకృతం అయిందన్నారు. భారతీయులంతా కుల, మతాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి, భారత రక్షణదళాలకు సంపూర్ణ మద్దతు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి నాయకులు వాసు, దామోదర్ గుప్తా, తనూజ్, మునివర్ధన్, జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

కళాశాల గొడవలో విద్యార్థికి గాయాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక గాయత్రి కళాశాల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. గాయాలపాలైన విద్యార్థి ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గాయత్రి కళాశాలలో బీఎస్సీ చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఇరువురు కొట్టుకున్నారు. ఓ విద్యార్థి రాడ్‌తో దాడి చేయడంతో మరో విద్యార్థికి తీవ్రగాయమైంది. దీంతో అతను ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చికిత్స కోసం ఆ విద్యార్థిని కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థుల వ్యవహారం కావడంతో వివరాలు సేకరిస్తున్నారు. అయితే విద్యార్థుల మధ్య ఇంత జరుగుతున్నా కళాశాల యాజమాన్యం పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.